సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 19 । జూలై । 2023



ఉద్యోగం సులువు

కొలువు సులువుగా లభించేలా డిగ్రీ చదువు మారనుంది. నాలుగేళ్ల కోర్సు ప్రారంభమైంది. - 8లో



నగరంలో 'చల్లదనం'

శ్రీకాకుళంలో అమ్మవార్లకు చల్లదనం నిర్వహించారు. మేళతాళాలతో సందడి చేశారు. - 8లో

విజయ గణపతికి ప్రత్యేక అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో వెలసిన విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

న్యూస్‌రీల్

డీసీసీబీ చైర్మన్ పదవీకాలం మరో 6 నెలలు పొడిగింపు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు పదవీ కాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం, ఆప్కాబ్ చైర్మన్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదల చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ సొసైటీ చట్టం ప్రకారం ఈ పొడిగింపు ఈనెల 18వ తేదీ నుంచి 2024 జనవరి 17వ తేదీ వరకూ ఉంటుంది. కరిమి రాజేశ్వరరావు జూలై 20, 2021న డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు సమర్థంగా నిర్వహించడంతో ప్రభుత్వం డీసీసీబీ చైర్మన్‌గా రాజేశ్వరరావు పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది.

టెక్కలి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీ



టెక్కలి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు చేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

టెక్కలి: టెక్కలి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం వార్షిక తనిఖీలు చేశారు. సర్కిల్ కార్యాలయంలో వివిధ రకాల సంఘటనలపై ఆరా తీశారు. అలాగే కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు, వివిధ రకాల నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందజేశారు. అలాగే వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు. ఆమెతో పాటు టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ చంద్రమౌళి, ఎస్‌ఐ రామకృష్ణతో పాటు సిబ్బంది ఉన్నారు.

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



డీఆర్‌ఎంకు సమస్యలు చెబుతున్న స్థానికులు, ప్రయాణికులు

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌ను తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం అనూప్‌శత్పథీ మంగళవారం సందర్శించారు. గుణుపూర్ వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆయన ప్రత్యేక రైల్లో మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీకాకుళం రోడ్‌లో దిగారు. ఈ సందర్భంగా ఆమదాలవలసకు చెందిన కొందరు రైల్వేస్టేషన్‌లోని సమస్యలను ఆయన ముందుంచారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మెట్టక్కివలస వైపు ఉన్న గూడ్స్ షెడ్ వరకు పొడిగించాలని కోరారు. ప్లాట్‌ఫాం పైకప్పు పూర్తి స్థాయిలో వేయాలని కోరారు. స్టేషన్ వెలుపల ఉన్న దుకాణాలు గత ఏడాది ఎవరి పేరు మీద ఉన్నాయో అదే పేర్లతో రెన్యువల్ చేయాలని వ్యాపారులు విన్నవించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ మొదలవలస రవి, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి, ఏఈఎన్ బీవీఎస్ మూర్తి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ తాపా, వర్తకులు, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర భూ సర్వేలో అలసత్వం వద్దు'



తహసీల్దార్ కార్యాలయంలో భూ రీసర్వే మ్యాపింగ్ పత్రాలను పరిశీలిస్తున్న జేసీ నవీన్

ఇచ్ఛాపురం రూరల్: సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో అలసత్వం వహించరాదని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. ఆయన మంగళవారం ఆకస్మికంగా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే కార్యక్రమాలను తనిఖీ చేశారు. మండలంలో 28 గ్రామాలకు గాను ఇప్పటి వరకు కేవలం 18 గ్రామాల్లోనే సమగ్ర భూ సర్వే నిర్వహించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. రైతుల సమక్షంలో క్షేత్రస్థాయిలో నిజనిర్ధారణ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో భూ రీ సర్వేకు సంబంధించి కంప్యూటర్‌లో భూములు, చెరువులను ఎలా మ్యాపింగ్ నమోదు చేస్తున్నారన్న విషయాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.మీనాదేవి, భూ సర్వే డీటీ శ్రవణ్‌కుమార్, ఉప తహసీల్దార్ శ్రీహరి, మండల సర్వేయర్ తవిటినాయుడు, సిబ్బంది ఉన్నారు.

ఆశల చిగురింత



శ్రీకాకుళం: పొలాల్లో నీరు చేరిన దృశ్యం

- వర్షాలతో చిగురించిన రైతుల ఆశలు
- ఎండిన నారుమడులకు ఉపశమనం
- జిల్లావ్యాప్తంగా సగటున 25.6 మిల్లీమీటర్లు వర్షం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వరుణుడు ఎట్టకేలకు కరుణ చూపాడు. ఆశించిన స్థాయిలో వానలు లేకపోవడంతో సిక్కోలు రైతు దిగాలు పడిపోయాడు. జనం కూడా ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రెండు రోజులుగా పడిన వానలతో రైతులు, జిల్లా ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది.

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం 1.75 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. వానలతో వెద పద్ధతిలో వేసిన పొలాలకు జీవం వచ్చినట్టైంది. నారుమడులకు కూడా జల్లులు ప్రాణం పోశాయి. మొక్కజొన్న ఈ ఏడాది 10550 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 3899 హెక్టార్లలో మాత్రమే పంట వేశారు. ఇదే రకంగా వర్షాలు కురిస్తే మిగిలిన విస్తీర్ణంలో సాగుచేయడం పూర్తవుతుంది.

వర్షపాతం ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 రోజుల్లో సగటున 11 రోజులు వర్షం పడింది. సాధారణ వర్షంపాతం 242 మిల్లీమీటర్లు పడాల్సి ఉన్నప్పటికి 201 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. జూన్ నెలలో వర్షాలు కురవాల్సి ఉన్నప్పటికి ఆ నెలలో కురవకపోవడంతో ఖరీఫ్ సాగు ఆలస్యమైంది. ఈ నెలలో అత్యధిక వర్షపాతం పాతపట్నం మండలంలో 430 మిల్లీమీటర్లు కురవగా అత్యల్పంగా జి.సిగడాం మండలంలో కేవలం 55 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. మంగళవారం కురిసిన వర్షంతో పొలాల్లో, నారుమడుల్లో, వెద పొలాల్లో పుష్కలంగా నీరుచేరాయి. ఇలాగా మరో రెండు మూడు రోజులు వర్షాలు కురిస్తే ఓ పది రోజుల్లో ఉభాలు పూర్తయ్యే అవకాశం ఉంది.



● మెళియాపుట్టిలో అత్యధిక వర్షపాతం నమోదు

డివిజన్ పరిధిలో రెండు రోజులుగా జోరుగా వానలు పడుతున్నాయి. మెళియాపుట్టి మండలంలో అత్యధికంగా 84.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పాతపట్నంలో 66.2, కోటబొమ్మాళి, టెక్కలిలో 41, హిరమండలంలో 26.8, కొత్తూరులో 26.4, ఎల్.ఎన్.పేటలో 25.2, సారవకోటలో 24.8, సంతబొమ్మాళిలో 16.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.– టెక్కలి

సరైన సమయంలో..



మంగళవారం కురిసిన వర్షాలతో ఖరీఫ్ పంటపై ఆశలు చిగురించాయి. వెదపొలాల స్నీ ఎండిపోయి బీటలు వారి పోయే సమయంలో ఆశించిన స్థాయిలో వర్షం కురిసింది. ఇలాగే మరో రెండు మూడు రోజులు వర్షాలు కురిస్తే నారు పెరిగి ఉభాలు వేసే అవకాశం ఉంది.

– అరంగి కోటిబాబు, సత్యవరం, నరసన్నపేట

ఆశలు వదులుకున్న వేళ..



ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరించినా వానలు కాస్త ఆలస్యమవ్వడంతో ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నాం. ఇంతలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో పొలాలన్నీ నిండుగా దర్శనమిస్తున్నాయి. ఓ పది రోజుల్లో ఉభాలు వేసేందుకు అవకాశం ఉంటుంది. – కుంచాల రాంబాబు, పొరాపురం

ఉభాలకు సిద్ధం కావాలి



జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సాగు లక్ష్యం 1.75లక్షల హెక్టార్లుగా నిర్ణయించాం. ఇప్పటికే రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు అందించాం. రెండు రోజులుగా పడుతున్న వానలు అందరికీ ఉపయోగకరమైనవే. ఆర్‌బీకేల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. మొక్కజొన్న రైతులకు ఈ వర్షం అనుకూలమైందే. – కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం.

● రోడ్డుపై చేపలు!

వజ్రపుకొత్తూరులో మంగళవారం రోడ్డుపై చేపలు ఈదుతూ కనిపించాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న వజ్రాల చెరువులో నుంచి చేపలు రోడ్డుపైకి ఈదుకుంటూ ఎగబాకాయి. దీంతో స్థానికులు చేపలను పట్టేందుకు పోటీ పడ్డారు.

–వజ్రపుకొత్తూరు రూరల్



రోడ్డుపైకి ఎక్కిన చేపలు

మన ప్రభుత్వం.. దేశానికే ఆదర్శం

● స్పీకర్ తమ్మినేని సీతారాం



కాళపర్తి గ్రామంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష అద్భుత కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కాళపర్తి, ఉప్పినివలస గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హత ఉండి వివిధ కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి, వారికి పథకాలు అందించాలనే లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులకు 11 రకాల సేవలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. గతంలో ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రభుత్వం ఆ పరిస్థితులను సమూలంగా మార్చేసిందని తెలిపారు. ఈ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో గొప్ప మార్పు తీసుకొచ్చాం

● మంత్రి ధర్మాన ప్రసాదరావు



ధ్రువపత్రాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

గార: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పాలనలో గొప్ప మార్పు తీసుకొచ్చామని, పేదల చెంతకే పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం గార మండలం నిజామాబాద్ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, మాట ఇచ్చి తప్పిన వ్యక్తి చంద్రబాబు అని చెప్పారు. నాలుగేళ్లుగా పౌరుల ప్రయోజనమే లక్ష్యంగా నిష్పక్షపాత ధోరణిలో పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయిలో ఉండాలన్న లక్ష్యంతో విద్యావ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చామని గుర్తు చేశారు. మహిళా సంఘాలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి మోసం చేసిన చంద్రబాబు, వచ్చే ఎన్నికల్లో బంగారం ముక్కలు ఇస్తామని ఆశపెట్టే అవకాశముందన్నారు. వాటిని నమ్మవద్దన్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి రాష్ట్రంలో 27 లక్షల ఎకరాల భూమిపై హక్కులు ఇచ్చామని వివరించారు. నిత్యావసర ధరలపై విపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంట నూనె ధరలు కేంద్రం నిర్ణయిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయిలో నాణ్యమైన బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు ఇస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటివద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మేలు కోరే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు, ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గంగు రామారావు, ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలి

● మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు



గ్రామంలోని లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

పలాస: గ్రామాల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని, అందుకు అనుగుణంగా కడుపులో ఉన్న బిడ్డ మొదలుకుని పండు ముదుసలి వరకు ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం గురుదాసుపురం గ్రామంలో మంగళవారం గుడ్‌మార్నింగ్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జోరున వాన పడుతున్నా స్థానికులు మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ఏ ఇంటికి ఎన్ని అందాయన్నది వారి సమక్షంలోనే చెబుతూ ఇంకా రాని వారు ఉంటే వారికి కూడా అందజేయాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ, జెడ్పీటీసీ మచ్చ రత్నాలు, ఎంపీటీసీ గౌరకల మనీషా, రంగోయి, మాకన్నపల్లి సర్పంచులు గేదెల లక్ష్మీకుమారి,సైని దేశయ్య, సచివాలయాల కన్వీనరు దువ్వాడ రవి తదితరులు పాల్గొన్నారు.

బిర్లంగి ఆర్‌బీకేలో చోరీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బిర్లంగి రైతు భరోసా కేంద్రంలో టీవీ చోరీకి గురైందని గ్రామ వ్యవసాయ సహాయకుడు బంటుపల్లి వెంకటేష్ తెలిపారు. వివరాలలోకి వెళితే.. గ్రామ సచివాలయం పరిధిలోని ప్రభుత్వ సామాజిక భవనంలో రైతు భరోసా కేంద్రం నిర్వహిస్తున్నారు. సోమవారం విధులు పూర్తి చేసుకొని భవనానికి తాళాలు వేసుకొని ఇంటికి వెళ్లిపోయిన వ్యవసాయ సహాయకుడు వెంకటేష్ మంగళవారం ఉదయం కార్యాలయం వద్దకు వచ్చినప్పుడు తాళాలు తెరిచి ఉండటం గమనించారు. కేంద్రంలో సుమారు రూ.60వేలు విలువైన టీవీ కనిపించకపోవడంతో వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. రూరల్ ఎస్‌ఐ వి.రమేష్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించారు. పక్కనే ఉన్న గ్రామ సచివాలయం తాళాలు సైతం పడగొట్టిన దొంగలు పలు డెస్కులు చిందరవందర చేసి వెళ్లినట్లు గుర్తించారు. వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12 ఏళ్ల సొంతింటి కల సాకారం



మఠం సరియాపల్లిలో ఇళ్ల పట్టాలు అప్పగిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: మండలంలోని మఠం సరియాపల్లిలో 12 ఏళ్ల క్రితం దివంగత వైఎస్సార్ హయాంలో మంజూరైన ఇందిరమ్మ కాలనీ లబ్ధిదారుల సొంతింటి కల ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నెరవేరింది. ఈ మేరకు లబ్ధిదారులకు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు చేతులమీదుగా మంగళవారం స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రాంగణానికి శంకుస్థాపన చేశారు.

గ్రామంలో ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లో 93 మందికి సెంటుంపావు చొప్పున స్థలాన్ని కేటాయించి 2011లో రెవెన్యూశాఖ పట్టాలు కేటాయించింది. ఆ తర్వాత ఏర్పడిన రాజకీయ వివాదాల కారణంగా స్థలాలను అప్పగించలేదు. అప్పటి నుంచి వారు ప్రతి సందర్భంలో తమకు కేటాయించిన స్థలాలను అప్పగించాలని కోరుతున్నారు. ఎట్టకేలకు ఈ స్థలాలు ఎవరికి కేటాయించినవి వారికి ఇవ్వడానికి అధికార యంత్రాంగం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతో స్థలాలు అప్పగించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, సర్పంచ్ కొణపల సురేష్, మండల పార్టీ నేత ఇప్పిలి కృష్ణారావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

చిరు బతుకులకు తోడు

- 'జగనన్న తోడు' ద్వారా జిల్లాలో 22,794 మందికి రూ. 24.55కోట్లు రుణం
- గతంలో రుణాలు తీసుకున్న 25,614 మందికి రూ.68.20 లక్షలు వడ్డీ జమ
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



చెక్కు అందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, కిల్లి కృపారాణి, అంధవరపు సూరిబాబు తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరు వ్యాపారులకు అధిక వడ్డీల నుంచి విముక్తి కల్పిస్తూ, వారి బతుకులకు జగనన్న తోడు పథకం ఉపయోగపడుతోందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జగనన్న తోడు ఏడో విడత రుణాలు, ఆరు విడతల అప్పు తీసుకున్న వారికి వడ్డీ విడుదల కార్యక్రమం మంగళవారం జరిగింది. విజయవాడ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. జిల్లాలో 22,794 మంది లబ్ధిదారులకు రూ.24.55 కోట్ల రుణాలు, అలాగే గతంలో రుణాలు తీసుకున్న 25,614 మంది లబ్ధిదారులకు రూ. 68.20 లక్షలు వడ్డీ జమ చేయనున్నట్లు తెలిపారు. సకాలంలో చెల్లించిన వారికి ఏటా మరో రూ.1,000 చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకూ వడ్డీలేని రుణాన్ని అందజేస్తామన్నారు. ఇంకా ఎవరికైనా ఈ పథకం అందకపోయి ఉంటే అధికారులను సంప్రదించి తిరిగి పొందవచ్చని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, రాజపు హైమావతి, సుడా చైర్‌పర్సన్ ఆశాలత, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఎల్‌డీఎం ఎం.సూర్య కిరణ్, మెప్మా పీడీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా కుటుంబానికి అండ



నా పేరు పి.తులసి. మాది జలుమూరు మండలం తలతరిమ గ్రామం. నేను శ్రీలక్ష్మి స్వయం సహాయక బృందంలో సభ్యురాలిగా ఉన్నాను. జగనన్న తోడు కింద తొలిగా రూ.10వేలు అందితే ఆ డబ్బుతో కట్‌పీసెస్ వ్యాపారం మొదలు పెట్టాను. రెండోసారి డబ్బులు వచ్చినప్పుడు సీజనల్ ఫ్లవర్స్ వ్యాపారం కూడా ప్రారంభించాను. నా కుటుంబ సభ్యులు కూడా ఇందులో ఉన్నారు. జగనన్న తోడు డబ్బులతోనే ఈ వ్యాపారాలు చేశాం. మూడోసారి పడిన డబ్బుతో జిరాక్స్ మిషన్ కొన్నాను. ఈ మూడు విడతల డబ్బును నెలకు రూ.15వేలు ఆదాయం వచ్చేలా మేం సద్వినియోగం చేసుకున్నాం. ఇలాంటి ముఖ్యమంత్రికి ఆ దేవుడు తోడుగా నిలిచి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలి.

నేడు జిల్లా అండర్–13 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్–13 బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు బుధవారం శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ వేదికగా జరగనున్నాయని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం వేదికగా ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న 8వ ఏపీ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌కు పంపించనున్నట్లు చెప్పారు. 19వ తేదీన సాయంత్రం 4 గంటలకు బాస్కెట్‌బాల్ కోర్టు వద్ద రిపోర్ట్ చేయాలని ఎమ్మెస్సార్ కోరారు. వివరాలకు కోచ్, కార్యనిర్వాహక కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి (9949291288)ని సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా అఫీస్‌నాయుడు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ నిర్వహించిన నియామకాల్లో చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్‌గా కొమరావు అఫీస్‌నాయుడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీనియర్ న్యాయవాదిగా, మూడుసార్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఉచితంగా లీగల్ సేవలు అందిస్తానన్నారు. ఈయన నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, పొన్నాడ వెంకటరమణ, వాన కృష్ణచంద్, తంగి శివప్రసాదరావు, బెజ్జిపురపు ఫల్గుణరావు, చంద్రమౌళి, పాలిశెట్టి మల్లిబాబు, కిల్లారి ఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఆదిత్యుని సన్నిధిలో డీఎఫ్ఓ



నిషాకుమారికి జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా అటవీ శాఖాధికారి, ఐఎఫ్ఎస్ అధికారి నిషాకుమారి కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమెకు ఘన స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో అర్చకులు సాందీప్‌శర్మ, సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

టెక్కలి రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో డి.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 8వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1934లో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం నేడు దేశవ్యాప్తంగా విస్తరించి కోటికి పైగా సభ్యులు ఉన్న సంఘంగా ఎదిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా డి.నీలవేణి, బి.మల్లేష్, మరో 10మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాంతిభద్రతలు పరిరక్షించాలి



నిరసన తెలియజేస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులకు భద్రత కల్పించాలని, మతసామరస్యం వర్ధిల్లేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా కమిటీ సభ్యులు నినదించారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గరికి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మణిపూర్ అల్లర్లను అరికట్టి శాంతిభద్రతలను పరిరక్షించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఓంపూరు రమేష్ మాట్లాడుతూ దాడులు అరికట్టే దిశగా ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పైడి మోజేస్ రాజు, జాయింట్ సెక్రటరీ ఆర్.సాల్మన్‌రాజ్, కోశాధికారి ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ చదువు.. ఉద్యోగం సులువు!

- సరికొత్తగా రూపుదిద్దుకున్న డిగ్రీ కోర్సులు
- ఈ ఏడాది నుంచి నాలుగేళ్ల వ్యవధి కోర్సులు అమలు
- ఐటీ, పరిశ్రమలు, స్వయం ఉపాధి అవసరాలకు అనుగుణంగా సిలబస్
- జిల్లాలో 6450 మంది విద్యార్థులకు ఉపయుక్తం



శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల



శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో యూజీ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: చదువుకు సార్థకత లభించాలంటే ఉద్యోగం రావాల్సిందే. అయితే సాధారణ డిగ్రీ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అంతంతమాత్రమే. ఈ నేపథ్యంలో డిగ్రీ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. నూతన విద్యా సంస్కరణలో భాగంగా డిగ్రీ పూర్తయ్యేలోపు ఉద్యోగం, ఉపాధి అందించాలనే దిశగా విద్యా ప్రణాళికను అమలుచేస్తోంది. తాజాగా డిగ్రీ విద్యతో ఉద్యోగం, ఉపాధి కల్పించే కోర్సులను అందుబాటులోకి తెచ్చింది.యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) సూచన మేరకు కళాశాలలు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రవేశపెట్టాయి.

విద్యార్థులకు ఉపయోగం..



విద్యార్థుల భవిత కోసం ప్రభుత్వం గొప్ప ఆలోచన చేసింది. డిగ్రీ చదువు ద్వారా ఉద్యోగం గ్యారెంటీ అనే రీతిలో ఆనర్స్ కోర్సులను డిజైన్ చేశారు. సిలబస్‌లను మార్పులు చేశారు. నాలుగేళ్ల యూజీ కోర్సు పూర్తిచేస్తే దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నాలుగేళ్లు చదివితే డిగ్రీతోపాటు పీజీ మొదటి సంవత్సరం చేసినట్లు సర్టిఫికెట్ వస్తుంది. తర్వాత ఆసక్తి కలిగినవారు పీహెచ్‌డీ కూడా చేసుకోవచ్చు. డిగ్రీలో మూడేళ్లు చదివాక నాలుగో ఏడాది బీఈడీ చదువుకోవచ్చు.

– డాక్టర్ కణితి శ్రీరాములు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాతపట్నం

ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు..

డిగ్రీ ఆనర్స్, ఆనర్స్ విత్ రీసెర్చ్ డిగ్రీ కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నాయి. జిల్లాలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషులు, మహిళల కళాశాలలు, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, బారువ, పాతపట్నం, పొందూరు, తొగరాంలో మొత్తం 11 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఉన్నత విద్యా విద్యామండలి మార్గదర్శకాల ప్రకారం వసతులు ఉన్న కాలేజీల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టనున్నారు. దీంతో జిల్లాలో దాదాపు 6,450 మంది విద్యార్థులకు ఈ కోర్సులు ఉపయుక్తం కానున్నాయి. కొన్ని ప్రైవేటు కళాశాలల్లోను కోర్సులు అందిస్తున్నారు.

అవగాహన సదస్సులు..

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం కోసం శ్రీకాకుళం జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు. అధ్యాపకులు వెబెక్స్ ద్వారా విద్యార్థులను కోర్సులపై చైతన్యపరుస్తూ నూతన డిగ్రీ కోర్సుల అభ్యసనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్నారు. కోర్సు పూర్తి చేస్తే దేశంలో ఎక్కడైనా ఉన్నత విద్యను అభ్యసించవచ్చని, విదేశాల్లో సైతం ఉపాధి అవకాశాలు సులభంగా లభిస్తాయని చెబుతున్నారు.

డిగ్రీతో ఉద్యోగం గ్యారెంటీ..

ఐటీ, పారిశ్రామిక సంస్థలు, ఇతర గిరాకీ ఉన్న అవసరాలకు అనుగుణంగా నూతన సిలబస్‌లను ప్రవేశపెట్టారు. కళాశాల నుంచి కొలువులు దక్కేలా ప్రత్యేక నైపుణ్యాలపై దృష్టి పెట్టేలా చేస్తున్నారు. ఇందుకోసం ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. బీటెక్ కోర్సులకు దీటుగా డిగ్రీ విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సరికొత్త సంస్కరణలకు నాంది పలికింది. ఇందుకోసం సిలబస్‌లను రూపకల్పన చేసింది.



ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు చేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

కొత్త కోర్సులివే..

బీఏ ఆనర్స్: హిస్టరీ, టూరిజం మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లిష్, స్పెషల్ తెలుగు మేజర్ సబ్జెక్టులుగా ఉంటాయి. సోషియాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సైకాలజీ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయి.

బీకాం ఆనర్స్: బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ డిజిటల్ మార్కెటింగ్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, ఫైనాన్సియల్ సర్వీసెస్, అకౌంట్స్ ట్యాక్సెస్ మేజర్ సబ్జెక్టులుగా ఉంటాయి.

బీఎస్సీ ఆనర్స్: కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, హార్టికల్చర్, జువాలజీ, అగ్రికల్చర్, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా ఉంటాయి. మైనర్ సబ్జెక్టులుగా ఫుడ్ టెక్నాలజీ ఉంటుంది. ఎంపిక చేసుకున్న కోర్సుకు ఆధారంగా మరి కొన్ని మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయి.

డిగ్రీతోపాటు బీఈడీ..

నూతన విద్యావిధానంలో బీఈడీ కోర్సును సైతం ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. న్యూజిలాండ్, అమెరికా, కెనడా తదితర దేశాల్లో అధ్యయనం చేసి ఈ కోర్సును అమల్లోకి తెచ్చినట్టు తెలిసింది. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్ రెండేళ్లు చదవాల్సిన అవసరం లేకుండా.. కేవలం నాలుగేళ్లలోనే (ఒక సంవత్సరం వ్యవధి తగ్గబోతుంది) మొత్తం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వం నిర్వహించే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కోసం డీఎస్సీ రాసే అర్హత లభించనుంది.

యూజీ ఆనర్స్: మొదటి సంవత్సరం పూర్తి చేస్తే సర్టిఫికెట్ ఇస్తారు. రెండో ఏడాది పూర్తి చేసిన వారికి డిప్లొమో వస్తుంది. మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ, నాలుగో ఏడాది ఉత్తీర్ణులైతే ఆనర్స్ పట్టా పొందుతారు. నాలుగేళ్లు ఆనర్స్ పూర్తి చేసిన తరువాత పీజీ ఏడాది చదివితే నేరుగా పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంటుంది.

వక్ఫ్ బోర్డు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం: పట్టణంలో వక్ఫ్ బోర్డు స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని వక్ఫ్ బోర్డు అధికారులు షేక్ సిద్దిక్ రియాజ్ ఖాన్ హెచ్చరించారు. ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా 197/4 సర్వే నంబర్ గల 3.75 ఎకరాల వక్ఫ్ బోర్డు స్థలంలో అనధికార కట్టడాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. కార్యక్రమంలో హజరత్ యూసఫ్ తకియా దర్గా కమిటీ అధ్యక్షుడు, ప్రతినిధులు హెచ్‌ఎం అబ్దుల్లా, అబ్దుల్ మన్నన్, ఎండీ ఇర్షాన్, ఎస్‌కే షర్ఫరాజ్, మస్తాన్ షరీఫ్, ప్రేమ్ సర్ఫరాజ్‌ఖాన్, అలీమ్‌ఖాన్ ముస్లిం పెద్దలు జోహార్ ఖాన్, ఎండీ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

'పవన్ తీరు సరికాదు'



గద్దిబోయిన కృష్ణయాదవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఐ అంజూ యాదవ్ విధుల్లో భాగంగా జనసేన కార్యకర్తల ధర్నాను అడ్డుకుంటే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చిత్తూరు ఎస్పీకి ఫిర్యాదు చేయడం తగదని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దిబోయిన కృష్ణయాదవ్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ కానిస్టేబుల్ కొడుకుగా ఉన్న పవన్‌కల్యాణ్‌కు పోలీసులు తమ విధులు ఎలా నిర్వహిస్తారో తెలియదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో తహసీల్దార్ వనజాక్షిపై చింతమనేని దాడి చేసినప్పుడు నోరుమెదపని పవన్ ఇప్పుడు ఓ మహిళా సీఐపై చర్యలు తీసుకోవాలని కోరడం తగదన్నారు. యాదవ కులానికి చెందిన మహిళ అనే పవన్‌కు చిన్నచూపు అని మండిపడ్డారు. ప్రభుత్వ విధానాలకు విఘాతం కలిగించే ఏ పార్టీ నాయకులపైనైనా చర్యలు తీసుకుంటారనే విషయం గుర్తెరగాలన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే ప్రగతి



సెమినార్ సంకలనం విడుదల చేస్తున్న ప్రొఫెసర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్యలో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలతోనే ప్రగతి సాధ్యమవుతుందని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ ఎ.చంద్రమోహన్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విద్యలో వినూత్న ఆధునిక పద్ధతులు అమలు అనే అంశంపై జరగనున్న రెండు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయంగా వస్తున్న విద్యా మార్పులను గమనిస్తుండాలని చెప్పారు. రీసెర్చ్ ఆర్టికల్స్, ప్రాజెక్టులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కరిక్యులమ్ నిర్వహణలో మార్పులు అవసరమని చెప్పారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. వర్సిటీ విద్యలో మార్పులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అనంతరం సెమినార్ సంకలనం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, టెక్నో హబ్ వీఐటీ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు అబ్రహం సునీల్, ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ నీలం సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ స్థలంలో టీడీపీ నేత పేరుతో బోర్డు



జగనన్న కాలనీ స్థలంలో కాళ్ల ధర్మారావు పేరిట వెలసిన బోర్డులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామం డిగ్రీ కళాశాల సమీపం కొళిగాం రోడ్డులో సర్వే నంబర్ 197 గల రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ వారు 2021లో సుమారుగా రూ.12 లక్షల వ్యయంతో చదును చేసి 102 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల కోసం అందించారు. ఇక్కడ జియో ట్యాగింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. అక్కడ గృహనిర్మాణాలకు అవసరమైన మౌలిక వసతులైన బోర్లు వేయించడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయడం, నీటి కుండీల ఏర్పాటు కూడా పూర్తయ్యింది. అయితే పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు ఈ స్థలం తనకు చెందినదంటూ, హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు కూడా మంగళవారం ప్రారంభించారు. ఈ విషయమై సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

'అనిత నోరు అదుపులో పెట్టుకోవాలి'



మాట్లాడుతున్న చింతాడ మంజు

నరసన్నపేట: రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లుగా మహిళల భద్రతకు, రక్షణకు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు చింతాడ మంజు, వెలమ, శ్రీశయన, పొందర కార్పొరేషన్ చైర్మన్లు పంగ కృష్ణవేణి, చీపురు రాణి, రాజాపు హైమావతిలు అన్నారు. ఏపీలో మహిళలకు భద్రత లేదంటూ తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఆమె నోరు అదుపులో పెట్టుకోకపోతే వైఎస్సార్ సీపీ మహిళలు తగిన విధంగా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు మూడు రోజులుగా సోషల్‌మీడియా వేదికగా అనిత చేస్తున్న తప్పుడు ప్రచారంపై మండిపడ్డారు. తన ఫొటోలను తానే మార్ఫింగ్ చేసుకొని ఇతరులపై నెట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. ఇలాంటి డ్రామాలు ఆడవద్దని, ఆత్మగౌరవం మీతో పాటు ఇతర మహిళలకు కూడా ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక మహిళా తహసీల్దార్‌పై మీ పార్టీ నాయకులు దాడి చేసి అవమాన పరిస్తే అప్పుడు మీరు ఏమైపోయారని ప్రశ్నించారు. సీఎం సతీమణి భారతమ్మను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని, ఇదే కొనసాగితే చెప్పులు చూపడం కాదు చెప్పులు మీద పడతాయని హెచ్చరించారు. సమావేశంలో సుడా చైర్మన్ కోరాడ ఆశాలత, నరసన్నపేట జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యులు బోయిన త్రివేణి, విమల కుమారిలతో పాటు మహిళా ప్రతినిధులు శైలజ తదితరులు ఉన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు

కాశీబుగ్గ: రాష్ట్ర ప్రభుత్వం జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేలలో కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సంత మైదానంలో మంగళవారం నిర్వహించిన జీడిరైతుల మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ 2019 నుంచి అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగాయని, జీడిపప్పుకు రేటు పెరుగుతుంది తప్ప రైతు పండిస్తున్న పంటకు ధర పెరగడం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, కె.మోహనరావు మాట్లాడుతూ జీడి రైతులు గిట్టుబాటు ధర లేక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని, జీడి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మెట్టూరు ఎంపీటీసీ కొండప్ప సురేఖ, మందస నాయకులు మట్ట ఖగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎన్.గణపతి, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.రామారావు, వి.మాధవరావు, టెక్కలి రైతాంగ సాధన సమితి నాయకులు ఎం.రామారావు, భీమారావు, వెంకన్న, ఎస్.కాంతారావు, బి.రమాదేవి, కె.వినోద్, వి.రామకృష్ణనాయుడు, కె.హేమారావు చౌదరి, జె.ప్రసాద్, అంబటి రామకృష్ణ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,100-00
బంగారం(22సి. 10గ్రా.)	55,100-00
వెండి (కిలో)	81,400-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

నగరంలో 'చల్లదనం'



పెద్దరెల్లివీధిలో తప్పెటగుళ్లు



విద్యుద్దీపాలంకరణ



ఆకట్టుకున్న వేషధారణ



కాకివీధిలో ముత్యాలమ్మతల్లికి పూజలు

ఓవైపు వాతావరణంలో చల్లదనం.. మరోవైపు అమ్మవార్లకు చల్లదనం కార్యక్రమాలతో శ్రీకాకుళం నగరంలో సందడి నెలకొంది. ఆషాఢమాస ఆఖరి మంగళవారం సందర్భంగా పాలకొండ రోడ్డులోని పెద్దరెల్లివీధి, కెల్లవీధి, రెల్లివీధి తదితర ప్రాంతాల్లో మహిళలు కలశాలతో వెళ్లి అమ్మవార్లకు చల్లదనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డప్పువాయిద్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. మంత్రి ధర్మాన ప్రసాదరావు పెద్దరెల్లివీధిలోని అమ్మవారిని దర్శించుకున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్